

నేటి నుంచి ఒంటిపూట బడులు

డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో పాఠశాలలకు ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ యాజమాన్యాల పరిధిలోని సుమారు 2,200 పాఠశాలలు శనివారం నుంచి ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారని డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ ఒంటిపూట బడులు ఈ విద్యా సంవత్సరం చివరి రోజైన ఏప్రిల్ 23 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న జిల్లాలోని 133 పాఠశాలల్లో మాత్రం పరీక్షలు ముగిసే వరకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారని ఆమె తెలిపారు.

సిఎం సారూ.. పట్టించుకోరూ..!



- ఆక్వా రైతుల ఇబ్బందులు తీవ్రతరం
- పరిశ్రమల కాలుష్యంపై చర్యలేవీ
- డెల్టా ఆధునీకరణ పూర్తి చేసేదెప్పుడో
- కొల్లేరు సమస్యకు పరిష్కారం ఎప్పుడు
- రెగ్యులేటర్ల నిర్మాణంపై తాత్సారం
- పోలవరం నిర్వాసితుల పరిస్థితి ఏమిటి?
- నేడు తణుకులో సిఎం పర్యటన



జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాలలో సభాస్థలి వద్ద ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి పది నెలలు గడుస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని రైతులు, ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారంపై ఇప్పటికీ కదలిక లేకుండాపోయింది. శనివారం సిఎం తణుకు పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. జిల్లాలోని సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజానీకం కోరుకుంటున్నారు. ముఖ్యంగా ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారు. రెండు జిల్లాల్లో దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. ఆక్వా సాగులో లక్షన్నర ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దఎత్తున ఆదాయం తెస్తున్న సాగుల్లో ఆక్వా ఒకటి. ప్రస్తుతం ఆక్వా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆక్వా మేతలు, మందుల ధరలు పెరిగిపోవడంతో పెట్టుబడి ఖర్చు పెరిగింది. ఎకరా రొయ్యల సాగుకు రూ.ఐదు నుంచి రూ.ఆరు లక్షల వరకూ ఖర్చవుతోంది. ధర స్థిరంగా లేకపోవడంతో ఆక్వా రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. వంద కౌంట్ ధర టన్ రూ.290 నుంచి ఒక్కసారిగా రూ.230కు పడిపోయింది. దీంతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితి. పదెకరాలు దాటితే విద్యుత్ సబ్సిడీ సైతం ప్రభుత్వం ఇవ్వడం లేదు. దీంతో తమ సమస్యలు పరిష్కరించాలని కొన్నిరోజులుగా ఆక్వా రైతులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని సిఎంను ఆక్వా రైతులు కోరుతున్నారు.

పరిశ్రమల కాలుష్యంతో తీవ్ర సమస్యలు..

డెల్టా ఆధునీకరణ పూర్తి చేసేదెప్పుడో

తణుకు నుంచి భీమవరం వరకూ ఉన్న దాదాపు 21 పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో తేల్చారు. పరిశ్రమల కాలుష్యం అరికట్టేందుకు అప్పట్లో కార్మికశాఖ మంత్రిగా ఉన్న పితాని సత్యనారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు భీమవరంలో ప్రత్యేక సమావేశం సైతం నిర్వహించారు. యనమదుర్రు డ్రెయిన్‌ను ప్రక్షాళిస్తామని చెప్పారు. ఆక్వా, ఇతర పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యం పంట కాలువల్లోకి చేరి తాగేందుకు గుక్కెడు నీళ్లు లేకుండాపోయాయి. కిడ్నీ, కేన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలు సైతం జనాలను చుట్టుముడుతున్నాయి. టిడిపి కూటమి అధికారంలోకొచ్చి పది నెలలు గడుస్తున్నా కాలుష్యంపై దృష్టి సారించని పరిస్థితి నెలకొంది. పరిశ్రమల కాలుష్యంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

గోదావరి డెల్టా పరిధిలో 5.29 లక్షల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణను పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో కాలువలు మెరకలేకపోవడం, షట్లర్లు పాడైపోవడం, ... జరిగింది. దీంతో చిన్నపాటి వర్షాలకు సైతం వేలాది ఎకరాల్లో పంటలు కోల్పోతున్నారు. గడిచిన ఖరీఫ్‌లోనూ జిల్లాలో దాదాపు 30 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది సైతం ఇప్పటి వరకూ డెల్టా ఆధునికీకరణకు సంబంధించి టెండర్లు పిలవలేదు. ఇరిగేషన్ అధికారులు రెండు జిల్లాల్లో దాదాపు రూ.450 కోట్లకు సంబంధించిన పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఆమోదం తెలిపి పనులు సాగించాలని రైతులు కోరుతున్నారు. కోకో పంటకు సరైన ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొలుదారులకు ప్రత్యేక చట్టం తెస్తామని చెప్పినా ఇప్పటికీ జరగలేదు. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలుదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

కొల్లేరు సమస్యకు పరిష్కారం ఎప్పుడు?

కొల్లేరు ప్రాంతంలో దాదాపు 120కుపైగా గ్రామాలు ఉండగా ఐదు లక్షలకుపైగా జనాభా ఉన్నారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని గత టిడిపి పాలనలో అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఒక్క అడుగూ ముందుకు పడలేదు. సుప్రీంకోర్టు తీర్పు పేరుతో ప్రస్తుతం కొల్లేరులోని చేపల చెరువులకు అటవీ శాఖాధికారులు గండ్లు కొడుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితి. అంతేకాకుండా 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో రైతులకు చెందిన 14 వేల ఎకరాల జిరాయితీ భూముల్లో చెరువులను సైతం గండ్లు కొట్టేసిన పరిస్థితి ఉంది. జిరాయితీ, ప్రభుత్వ ఇచ్చిన సొసైటీ భూములను తమకు అప్పగించాలని రైతులు కోరుతున్నారు. కొల్లేరు సరిహద్దులను తేల్చడంతోపాటు, మూడో కాంటూరుకు కుదించాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం కొల్లేరు సమస్యను ఎప్పటికి పరిష్కరిస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొల్లేరులోకి సముద్రపు నీరు ఎగదన్ని తీవ్ర నష్టం జరుగుతోంది. దుంపగడప, మొల్లపర్రు, తడికలపూడి వద్ద మూడు రెగ్యులేటర్ల నిర్మాణానికి గత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.450 కోట్లు కేటాయించింది. పనులు మాత్రం ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం పూర్తి చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

పోలవరం నిర్వాసితుల పరిస్థితి ఏమిటి?

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో సర్వం కోల్పోతున్న నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో పునరావాస ప్యాకేజీ అందని పరిస్థితి. గత ప్రభుత్వం పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలు ఇస్తామని చెప్పింది. కూటమి ప్రభుత్వం మాత్రం ఐదేళ్ల రూ.6.25 లక్షలు చొప్పున మాత్రమే ప్యాకేజీ సొమ్ము జమ చేసింది. 2006లో సేకరించిన భూములకు రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పి ఇవ్వని పరిస్థితి. 18 ఏళ్ల నిండిన యువతకు పరిహారం విషయంలో కోతలు పెట్టింది. భూమికి భూమి ఇంకా పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. కాలనీల నిర్మాణం పూర్తి చేయలేదు. జులై, ఆగస్టులో విరుచుకుపడుతున్న గోదావరి వరదలకు ప్రయేటా ముక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 21 వేల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. వర్షాకాలం వచ్చేసరికి నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందజేసి ఖాళీ చేయించాల్సి ఉంది. ప్రభుత్వం పోలవరం నిర్వాసితులకు కాంటూరుతో సంబంధం లేకుండా పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని కోరుతున్నారు. ప్రభుత్వం నిర్వాసితులకు న్యాయం చేస్తుందా, లేదా అనే ప్రశ్న అందరిలో వెంటాడుతోంది.

నేడు సిఎం పర్యటన సాగేదిలా..

ప్రజాశక్తి - తణుకు

ముఖ్యమంత్రి చంద్రబాబు తణుకు పర్యటనకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఆయన శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు పట్టణానికి విచ్చేయనున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అనే స్లోగన్‌తో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. హెలికాఫ్టర్‌లో చంద్రబాబు శనివారం ఉదయం ఎనిమిది గంటలకు తణుకు ఎస్ఎంవిఎం పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకుంటారు. అక్కడ స్వాగతం అనంతరం 8.21 నుండి 8.30 వరకు ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలతో సమావేశమవుతారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల నుండి రోడ్డు మార్గంలో 8.35కి పట్టణంలోని ఎన్‌టిఆర్ పార్కుకు చేరుకుని 9.10 వరకు పారిశుధ్య కార్మికులతో మాట్లాడతారు. 9.15కి జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాలకు చేరుకుని 10.15 వరకు ప్రజావేదిక నిర్వహిస్తారు. 10.15కి జూబ్లీ రోడ్డులోని నూలి వారి లేఅవుట్‌కు చేరుకుని 11.20 వరకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో, 11.20 నుంచి 11.50 వరకు జిల్లా అధికారులతో సమావేశమవుతారు. 12 గంటలకు పాలిటెక్నిక్ కళాశాలలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 12.10కి హెలికాప్టర్‌లో ఉండవల్లి బయల్దేరి వెళ్తారు.



ధర్నాలో నినదిస్తున్న నేతలు

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ యత్నాలు తగదు

కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విశాఖ ఉక్కు పరిశ్రమ పట్ల కేంద్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరి నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ సెంటర్లో నిరసన చేపట్టారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సిఐటియు, ఐఎఫ్‌టియు, ఎఐటియుసి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శులు డిఎన్‌విడి.ప్రసాద్, కె.బుచ్చిబాబు, బి.వెంకట్రావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్యాకేజీ పేరుతో మోసపూరితంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్యాకేజీ వల్ల స్టీల్‌ప్లాంట్‌కు ఎటువంటి ఉపయోగమూ లేదని విమర్శించారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం పథకం ప్రకారం స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ముడి ఇనుప ఖనిజం టన్ను రూ.వెయ్యికే వస్తుందని, అయితే ప్రస్తుతం టన్ను ముడి ఇనుప ఖనిజాన్ని రూ.ఆరు వేల నుంచి రూ.8 వేల వరకూ వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుందని, ఫలితంగా నష్టాల్లోకి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం సంవత్సరానికి 73 లక్షల టన్నులు ఉండగా గత సంవత్సరం 45 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేశారన్నారు. ఫలితంగా రోజుకి రూ.10 కోట్లకుపైగా నష్టం వస్తుందన్నారు. నష్టాలు వస్తున్నాయనే పేరుతో కాంట్రాక్ట్ కార్మికులను తొలగించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దేశంలోనే అత్యంత నాణ్యమైన విశాఖ స్టీల్ ఉత్పత్తిని కావాలనే బిజెపి ప్రభుత్వం తగ్గించి, నష్టాల్లోకి, నెట్టి ప్రయివేటు వారికి అప్పజెప్పేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడానికి, సొంత గనులు సమకూర్చడానికిగాని మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. తెలుగుదేశం మద్దతుతో కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వాన్ని సిఎం చంద్రబాబు స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కనీసం ప్రశ్నించడం లేదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు బిజెపిపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు బండి వెంకటేశ్వరరావు, భజంత్రీ శ్రీనివాస్, పి.కన్నబాబు, సిఐటియు నాయకులు జి.రవికిషోర్, ఐవి.సుధాకర్, వైఎస్.కనకారావు, కె.విజయలక్ష్మి, టిపిఆర్.దొర, జాన్‌బాబు, పి.ఆదిశేషు, ఎస్ఎన్.రమేష్, ఐఎఫ్‌టియు నాయకులు యర్రా శ్రీనివాస్‌రావు, గడసాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. విషాదాంతం..!

గూడెం వద్ద లారీని ఢీకొన్న కారు

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు

మండపేటలో పెను విషాదం

ప్రజాశక్తి - మండపేట, తాడేపల్లిగూడెం

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని రావులపేటకు చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనతో మండపేట పట్టణంలో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి. తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి వద్ద జాతీయ రహదారి పనులు చేస్తున్న వాహనాన్ని తణుకు వైపు వస్తున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మండపేట పట్టణానికి చెందిన భోగిళ్ల పాపారావు కుమారుడు భోగిళ్ల వెంకట సత్యసురేన్, భార్య నవ్య అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల కుమార్తె వాసవీ కృష్ణ (4)ను తీవ్ర గాయాలతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. సమీప బంధువు ఉప్పులూరి శ్రీరమ్య పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. సురేన్ కుటుంబం హైదరాబాద్ నుండి మండపేట కారులో వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.



కారులో మృతదేహాలు

లారీ ఓనర్స్ ఉమ్మడి రాష్ట్ర అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్, కీర్తిశేషులు భోగిళ్ల విశ్వనాథం ఇంట తీవ్ర విషాదం నెలకొంది. విశ్వనాథం కుమారుడు భోగిళ్ల పాపారావు కుమారుడు, కోడలు, మనవరాలు ఈ ప్రమాదంలో మృతి చెందారు. విశ్వనాథం అల్లుడు పాలచర్ల బాబ్జీ తన భార్య, కుమార్తె ఉప్పులూరి రమ్యతో కలిసి ఇటీవలే అమెరికా నుండి హైదరాబాద్ వచ్చారు. తన మేనత్త కుమార్తె రమ్యను సురేన్ తన కుటుంబంతో కలిసి మండపేట తీసుకొస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

ఏడెకరాల స్థలంలో కేంద్రీయ విద్యాలయం

స్థలాన్ని పరిశీలించిన కేంద్ర అధికారుల బృందం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ పరిధిలోని కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు స్థలాన్ని కేంద్ర అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. సువిశాలమైన ఏడు ఎకరాల స్థలంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయనున్నారు. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ బిఎస్.మీనా, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణకిషోర్, డిప్యూటీ ఇంజినీర్ కృష్ణమోహన్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, తహశీల్దార్ బి.సుబ్బారావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర అధికారుల బృందం

ఆర్‌జియుకెటిలో ఘనంగా సిగ్నస్-25 సంబరాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటిలో సిగ్నస్-25 సంబరాలు ఘనంగా నిర్వహించారు. క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పద్య నాటక రచయిత డాక్టర్ కెవిపి.కృష్ణ హాజరయ్యారు. దీప ప్రజ్వలనతో మొదలైన కార్యక్రమంలో అన్నమయ్య కీర్తనలు, ఎంతో ప్రసిద్ధమైన గర్బా నృత్యం విద్యార్థులు ప్రదర్శించారు. వీటితో పాటు విద్యార్థులు మృదంగం అద్భుతంగా వాయించి అందరి మెప్పులు పొందారు. ప్రారంభోత్సవంతో పాటు ఆన్‌దిడే ఈవెంట్ క్విజ్ మొదటి రౌండ్, ఫ్లాష్‌మాబ్, ఫ్లైయర్ లాంచ్, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, డిపిఎల్‌లో విజేతలకు బహుమతులు అందించారు. అంతిమ సంస్కారం అనే నాటక ప్రదర్శన, లైఫ్ ఆఫ్ మ్యాన్ పెర్ఫామెన్స్, ఇలా వివిధ రకాలైన కళాకృతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ఆర్‌జియుకెటి డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్, ఆర్‌జియుకెటి శ్రీకాకుళం డైరెక్టర్ ప్రొఫెసర్ కెవిజిడి.బాలాజీ, ఎఒ డాక్టర్ బి.లక్ష్మణరావు, సెంట్రల్ ఫైనాన్షియల్ ఆఫీసర్ డాక్టర్ నాగార్జునదేవి, అకాడమీస్ డీన్ డాక్టర్ చిరంజీవి, సిగ్నస్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, డిఎస్‌డబ్ల్యు, ఎడిఎస్‌డబ్ల్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలు, దళితుల సాగు భూములకు పట్టాలివ్వాలి

భూస్వాముల అధీనంలోని అసైన్డ్ భూములు పేదలకు పంచాలి

ప్రజాచైతన్య యాత్ర ప్రారంభ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - దెందులూరు

కొవ్వలి గ్రామంలో దళితులు, పేదలు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, సాగుకు అవకాశం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై ప్రజా చైతన్య యాత్రను కొవ్వలిలో ప్రారంభించారు. ఈ యాత్రకు దళ నాయకునిగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ వ్యవహరించగా సభ్యులుగా నాయకులు కె.లెనిన్, డి.నాగేంద్ర, పి.ఆనందరావు ఉన్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కొవ్వలిలో 1963 నుండి బంజరు భూమిగా ఉన్న ఆర్ఎస్ నెంబర్ 131/4లో 304 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పటి ప్రభుత్వాలు 101ఎకరాలు వ్యవసాయ క్షేత్రాలకు, 25 ఎకరాలు ఫిషరీస్ డిపార్టుమెంట్‌కు, మిగిలిన భూమిని భూమి లేని దళితులు, పేదలు సాగు చేసుకునేలా అవకాశం కల్పించారన్నారు. ఆరు నెలల నుండి కొవ్వలికి చెందిన వెలమాటి సౌందర్య గ్రామ దీపిక ట్రస్ట్ నాయకురాలు కోర్టులో కేసు వేసి పేదలను, దళితులను ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. వరి సాగు వల్ల కాలుష్యం ఏర్పడుతుందనే వింత వాదనతో కోర్టుకెళ్లడాన్ని రవి తీవ్రంగా దుయ్యబట్టారు. చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ భూములు ఉంటే ప్రభుత్వం దగ్గర, లేకపోతే పేదల దగ్గర ఉండాలని చట్టాలు చెబుతున్నా, అమలులో రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. దీంతో దళితులు, పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొవ్వలిలో పేదలు 50 ఏళ్లుగా పన్నులు చెల్లించి భూములు సాగు చేస్తున్నారని, వారిపై వెలమాటి సౌందర్య కక్షసాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గమని అన్నారు. ఆమె అక్రమంగా పేదలకు చెందిన అసైన్డ్ భూములను ఒకపక్క సాగు చేస్తూ, మరోపక్క పేదల సాగులో ఉన్న భూములపై కోర్టులో కేసు వేయడం సిగ్గుచేటని విమర్శించారు. బుడమేరు పొంగి విజయవాడ మునగడానికి కొవ్వలి దళితులు భూమి సాగు చేయటమే కారణమని చెప్పడం అత్యంత హాస్యాస్పదమన్నారు. కొవ్వలి తాగునీటి చెరువులో పూడిక తీసి నీటి సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దళ నేత రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వందలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని, ఆ భూములపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమగ్ర సర్వే చేసి బట్టబయలు చేయాలన్నారు. రానున్న రోజుల్లో కొవ్వలి భూసమస్యపై సిపిఎం పెద్దఎత్తున పోరాటానికి సన్నద్ధమవుతుందన్నారు. కొవ్వలిలో ప్రారంభమైన యాత్ర దోసపాడు, పోతునూరు గ్రామాల మీదుగా సాగింది. పోతునూరులో ఆటో కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దోసపాడు దళితులు తమ భూమి, గ్రామ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో నాగేంద్ర, కొవ్వలి నాయకులు వెంకట్రావు, రంగారావు, బుజ్జి, బాబు తదితరులు పాల్గొన్నారు.



దెందులూరు మండలం కొవ్వలిలో..



పోతునూరులో ఆటో కార్మికులతో..

చింతలపూడి: వంద పడకల హాస్పిటల్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఎం నాయకులు రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం పట్టణంలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రిని సిపిఎం బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ 2012లో ఈ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, ఎట్టకేలకు 2020లో పనులు ప్రారంభించారని చెప్పారు. 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. నాగిరెడ్డిగూడెంలో 2022లో అప్పటి ప్రభుత్వం తలపెట్టిన కాలనీ నిర్మాణాన్ని బృందం పరామర్శించింది. మూడొందల ప్లాట్లకుగాను 200కుపైగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టి మధ్యలో నిలిపివేశారని, కాంట్రాక్టర్లకు రూ.35 వేలు చెల్లించినా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేదని లబ్ధిదారులు వాపోయారు. ప్రభుత్వం వెంటనే లబ్ధిదారులకు అదనపు నిధులు కేటాయించి కాలనీ నిర్మాణం పూర్తి చేయాలని సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు అన్నారు. కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్.సూర్యకుమార్, నేత కురిసెట్టి అనురాధ నాయకత్వం వహించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎం.వరలక్ష్మీదేవి, డి.సత్యనారాయణ, సిహెచ్.సులోమాను తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడిలో...

దార్శనికుడు, ఆర్థికవేత్త మార్క్స్

ఘనంగా 142వ వర్ధంతి కార్యక్రమాలు



ఏలూరు అర్బన్ : మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కార్ల్ మార్క్స్‌కు సిపిఎం జిల్లా కమిటీ తరపున ఘన నివాళి అర్పించారు. కార్ల్‌మార్క్స్ 142వ వర్ధంతి కార్యక్రమం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ అధ్యక్షతన ఏలూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేశారు. తర్వాత పిచ్చుక ఆదిశేషు గీతాన్ని ఆలపించగా మిగిలిన సభ్యులు పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ 1883 మార్చి 14వ తేదీన కార్ల్ మార్క్స్ లండన్‌లో బ్రోన్కైటిస్ కారణంగా మరణించారని తెలిపారు. ఆయన మార్క్సిజం పితామహుడని కొనియాడారు. ఆయన జర్మన్ తత్వవేత్త, ఆర్థికవేత్త, చరిత్రకారుడు, సామాజికవేత్త, పాత్రికేయుడే కాకుండా సోషలిస్ట్ విప్లవకారుడని తెలిపారు. ఆయన రచనలు ఆధునిక అంతర్జాతీయ కమ్యూనిజానికి సైద్ధాంతిక పునాదిని ఏర్పాటు చేశాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సమసమాజాన్ని స్థాపించవచ్చుని, అది కేవలం కల కాదని, సాధ్యం చేయవచ్చుని తన సిద్ధాంతం ద్వారా రుజువు చేసిన మహోన్నత వ్యక్తి కార్ల్ మార్క్స్ అని కొనియాడారు. భారత దేశంలో కూడా ఏకమవుతున్న శ్రామిక వర్గాన్ని చీల్చివేసేందుకు మతోన్మాద శక్తులు మతం పేరుతో చిచ్చుపెడుతున్నాయని, బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు రాజకీయాలకు సాధనంగా హిందూ మతాన్ని వాడుకుంటూన్నాయని విమర్శించారు. ఈ సమాజంలో అందరికి విద్య, వైద్యం, తిండి, బట్ట, నీడ సమానంగా సమకూరాలంటే పెట్టుబడిదారీ, మతోన్మాదుల కుట్రలను అర్థం చేసుకొని వర్గపోరాటాలు నిర్వహించి సమసమాజాన్ని సాధించుకోవాలని, ఆ విధంగా కమ్యూనిస్టులు ముందుకు సాగాలని, ప్రజలు కలిసిరావాలని, తద్వారా కార్ల్ మార్క్స్‌కు నిజమైన నివాళులర్పించినట్లు అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ, జిల్లా నాయకులు ఎ.శ్యామలారాణి, కె.విజయలక్ష్మి, కె.లెనిన్, ఎం.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు : సమాజ గతిని మార్చిన సిద్ధాంతకర్త కార్ల్ మార్క్స్ 142వ వర్ధంతి కార్యక్రమాన్ని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యురాలు ఎంఎస్ఎన్.లక్ష్మి స్వాగతం పలికారు. కార్ల్ మార్క్స్ చిత్రపటానికి ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, శ్రీకృష్ణ హాస్పటల్స్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రామ్‌ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ మానవ సమాజం మీద అత్యంత ప్రభావం చూపించిన గొప్ప శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతి, సమాజ గమనాన్ని మార్చివేసిన సిద్ధాంతకర్తకారుల మార్క్స్ వర్ధంతి మార్చి 14వ తేదీ అని వారి గురించి వివరించారు. కార్ల్‌మార్క్స్ చెప్పిన భావాలను నేటి తరం అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు కె.జనని, వై.నిర్మల కృష్ణ ప్రసాద్, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : కమ్యూనిస్టు సిద్ధాంతకర్త, దార్శనికుడు, ఆర్థికవేత్త కార్ల్‌మార్క్స్ అని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అన్నారు. కార్ల్ మార్క్స్ 142వ వర్ధంతి సందర్భంగా జంగారెడ్డిగూడెం కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మండల కమిటీ సభ్యుడు జి.సూర్యకిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ చిన్నతనం నుంచే మంచి మేధావిగా ఉండేవారన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతం రాయడం కోసం ఎనలేని కృషి చేశారని చెప్పారు. ప్రపంచ స్థితి గతిని మార్చాలంటే కమ్యూనిస్టు ప్రాణాలిక అవసరమని, ఆ ప్రణాలిక రచించడం కోసం మార్క్స్ ఎంగిల్స్ ఎనలేని కృషి చేశారన్నారు. కార్మికులు ప్రజలందరినీ ఐక్యం చేసి రాజ్యాధికారం చేపట్టాలని మార్క్స్ సిద్ధాంతం చెబుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కె.సుబ్బారావు, పి.పోతురాజు, పి.చంటి, వీర్రాజు, బి.నాని, ఆశీర్వాదం, కె.స్టాలిన్, వి.రెడ్డి, ఎస్.భద్రయ్య, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు నూజివీడు విద్యార్థి

పలువురి అభినందన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు నూజివీడు విద్యార్థి వాకా రాహుల్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రాహుల్‌ను పలువురు ప్రముఖులు, క్రీడాకారులు, అభిమానులు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా సీనియర్ కోచ్, పీడీ డాక్టర్ వి.నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుంచి 23వ తేదీ వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి అండర్-23లో రాహుల్ ఎంపికయ్యాడని తెలిపారు. రాహుల్‌తో పాటు విజయవాడ నుంచి జి.నగేష్‌బాబు ఎంపికైనట్లు చెప్పారు. క్రీడా పోటీల్లో నైపుణ్యంతో కూడిన ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో బంగారు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రజలందరూ సహకరించాలని ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య కోరారు. మండలంలోని పల్లెర్లమూడి గ్రామంలో నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ సర్పంచి అధ్యక్షతన గ్రామ కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామంలో ఎవరైనా నాటు సారా తయారు చేసిన, అమ్మిన, రవాణా చేసిన వారి వివరాలు ఈ కమిటీ తెలియజేస్తుందని చెప్పారు. అనంతరం గ్రామంలో నాటుసారాయి రహిత ప్రచార రథం ద్వారా ప్రచారం చేయించారు.

గుబ్బల మంగమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభం

ప్రత్యేక ఆకర్షణగా గిరిజన నృత్యాలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని కామవరం అటవీ ప్రాంతంలో గిరిజనుల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మ జాతర మహోత్సవాలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. జాతర కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, పోలవరం మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, కరాటం రాంబాబు పాల్గొన్నారు. వారు గుబ్బలమంగమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గిరిజన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

20న కోకో రైతుల రాష్ట్ర సదస్సు

కోకో గింజల కొనుగోలు ధర తగ్గింపుపై రైతుల ఆందోళన

విజయవాడలో కోకో రైతుల సమావేశం నిర్ణయం

ప్రజాశక్తి - పెదవేగి

అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేయాలని, పాత గింజలు వెంటనే కొనాలని, కంపెనీలు రైతులను పెడుతున్న ఇబ్బందులను తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోకో రైతుల సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. విజయవాడ గాంధీనగర్‌లోని సీతారామ కళ్యాణ మండపంలో కోకో రైతుల సమావేశం మున్నంగి సుబ్బారెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన విజయవాడ గాంధీనగర్‌లోని సీతారామకళ్యాణ మండపంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. కంపెనీలు రైతులను ఇబ్బందులు పెట్టే ధోరణితోనే ఉన్నాయన్నారు. పాత గింజలు కొనుగోలు చేయకుండా కంపెనీలు రైతులకు నష్టం కలిగిస్తున్నాయన్నారు. కోకో గింజల కొనుగోలు ధర తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అంతర్జాతీయ ధర లేదని, వ్యాపారులు ధర ప్రభుత్వం చెల్లించి విధంగా రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోకో రైతులు అందరూ సంఘటితం కావాలని, ఈ నెల 20న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రాంతీయ కొబ్బరి రైతు సంఘం ఉపాధ్యక్షులు బొల్లు రామకృష్ణ, కోకో రైతులు కోనేరు సతీష్ బాబు, గారపాటి పూర్ణచంద్రరావు, నాగరాజు శ్రీనివాసరావు, జాస్తి కాశీ బాబు, బొల్లినేని ప్రసాద్, పాలడుగుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


నేరాలు - ఘోరాలు

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

పోలీసుల అదుపులో మృతురాలి భర్త

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

కుటుంబ కలహాల నేపథ్యంలో రిజర్వాయర్‌లో దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని సీతప్పగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇనుమురు గ్రామానికి చెందిన బేలం అశ్వి తేజస్విని (23)కి, సీతప్పగూడెం గ్రామానికి చెందిన కణితి సూర్యతేజాకు ఏడాది క్రితం వివాహమైంది. వీరికి ఏడు నెలల పాప ఉంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం సాయంత్రం భార్యాభర్తలు గొడవ పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన తేజస్విని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎక్కడా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం ఉదయం నిమ్మలగూడెం సమీపంలోని కోకొండ రిజర్వాయర్‌లో మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బుట్టాయగూడెం ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని రిజర్వాయర్ నుంచి బయటకు తీశారు. విషయం తెలుసుకున్న తేజస్విని కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని ఆ మృతదేహం తేజస్వినిదిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం తరలించారు. తేజస్విని భర్తను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చాట్రాయి

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు చాట్రాయి ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో ఆ గ్రామ శివారులో గురువారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.60,400 నగదు, 27 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులను కలగజేసే జూద క్రీడలను ఎవరైనా ప్రోత్సహించిన, పాల్గొన్నవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం ఏ రూపంలో ఉన్నా ఉపేక్షించబోమన్నారు. ప్రజలు జూద క్రీడల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా కృషి చేస్తున్నానని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరులోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వినతులందించేందుకు వచ్చిన వారిని ఆయన కలిశారు. ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజా సమస్యల పరిష్కారాన్ని ఒక యజ్ఞంలా నిర్వహిస్తున్నామన్నారు. దీంతో ఏలూరు నియోజకవర్గంలో తిష్టవేసిన అనేక జటిల సమస్యలు పరిష్కారమవ్వడంతో పాటు ప్రజల దశాబ్దాల కలలెన్నో సాకారమయ్యాయన్నారు. అలాగే మరిన్ని సమస్యల పరిష్కారానికి రానున్న కాలంలో పటిష్ఠ చర్యలు చేపట్టనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

రాయితీపై ఫ్రూట్ బ్యాగ్స్ పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మామిడి రైతాంగానికి 50 శాతం రాయితీపై ఫ్రూట్ బ్యాగ్స్ సరఫరా చేస్తున్నట్లు ఉద్యాన శాఖాధికారి ఆర్.హేమ తెలిపారు. మండలంలోని రావిచర్ల గ్రామంలో రైతాంగానికి 50 శాతం రాయితీపై ఫ్రూట్ బ్యాగ్స్ అందించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి హేమ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో మామిడి తోటల్లో కాయలకు ఫ్రూట్ బ్యాగ్స్ ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రతి మామిడి రైతుకూ 50 శాతం రాయితీపై ఫ్రూట్ బ్యాగ్స్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మామిడి కోత సమయంలో పాటించాల్సిన పలు సూచనలు రైతులకు తెలిపారు. ఫ్రూట్ బ్యాగ్స్ కావాల్సినవారు రైతు సేవ కేంద్రాల్లో ఆధార్, ఫోన్ నెంబర్‌తో అనుసంధానమైన బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డ్, భూమి పాసుపుస్తకం ఫొటో స్టాట్ కాపీలు, పాస్‌పోర్ట్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యాలయ పని వేళల్లో సంప్రదించవచ్చని సూచించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని రామన్నగూడెంలో తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ తిరివీధి కృష్ణ తెలిపారు. మండలంలోని రామన్నగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన వైద్య శిబిరంలో కృష్ణ మాట్లాడుతూ తిరివీధి లక్ష్మి రామారావు సేవా ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైద్య సేవలు అవసరమైన పేదలు 9640324266 సంప్రదించవచ్చన్నారు.

బిసి, ఒబిసి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా యేసురాజు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బిసి, ఒబిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా పామర్తి యేసురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా క్యాలెండర్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ చేతులమీదుగా ఆవిష్కరించారు. నూతనంగా ఎన్నికైన యేసు రాజును జెడ్‌పి చైర్‌పర్సన్ శాలువాతో సన్మానించారు. అనంతరం బిసి, ఒబిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యత్వ క్యూఆర్ కోడ్‌ను పద్మశ్రీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమెకు బిసి ఎంప్లాయిస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విటల్ కుమార్, కార్పొరేటర్ కలవకల్లు సాంబ, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం తరలిన జన సైనికులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పిఠాపురంలో శుక్రవారం నిర్వహించిన జనసేన ఆవిర్భావ దినోత్సవం సభకు ముదినేపల్లి మండలం నుంచి భారీగా జనసైనికులు తరలి వెళ్లారు. జనసేన నియోజకవర్గ నాయకులు ఎఎన్.బాబు ఆధ్వర్యంలో భారీగా జనసైనికులు, వీర మహిళలు మండలంలోని సింగరాయపాలెం ఎఎన్.బాబు కార్యాలయం నుంచి 15 కార్లు, రెండు బస్సులలో భారీగా తరలి వెళ్లారు.

టి.నరసాపురం : పిఠాపురంలో జరిగిన జనసేన 12వ ఆవిర్భావ సభకు మండలం నుంచి జనసేన పార్టీ మండలాధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో జనసేన శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో జనసైనికులు బస్సులు, కార్లలో వెళ్లారు.

పోలవరం : మండలంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు గుణపర్తి చిన్ని ఆధ్వర్యంలో60 కార్లు ఎనిమిది బస్సుల్లో సుమారు 600 మంది జనసేన కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు.

ఏలూరులో వేడుక

ఏలూరు సిటీ : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకను స్థానిక పార్టీ కార్యాలయంలో ఏలూరు పార్లమెంటు నియోజకవర్గాల సమన్వయకర్త, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళల సమక్షంలో జనసేన పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రెడ్డిఅప్పలనాయుడు మాట్లాడుతూ పిఠాపురానికి సుమారు 130 కారులతో భారీ ర్యాలీగా వెళ్తున్నట్లు చెప్పారు.

పార్టీ జెండా దిమ్మె ప్రారంభం

ముదినేపల్లి : జనసేన పార్టీ 12 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని గురజలో శుక్రవారం జనసేన పార్టీ జెండా దిమ్మెను ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వీరంకి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు ఎఎన్.బాబు, వేల్పూర్ నానాజీ, వడ్లాని ఆంజనేయులు, బెల్లంకొండ వెంకన్నబాబు, రాజబాబు పాల్గొన్నారు.

గతం కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం

ఉప విద్యాశాఖాధికారి రామమోహన్‌రావు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



ఐటిడిఎ కోట రామచంద్రపురం పరిధిలోని కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం, చింతలపూడి మండలాల్లోని 25 ఆశ్రమ పాఠశాలలు, నాలుగు గురుకుల పాఠశాలలు, మూడు కెజిబివి పాఠశాలల్లో కలిపి మొత్తం 1,120 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని ఉప విద్యాశాఖాధికారి జి.రామమోహనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ డిసెంబర్ చివరి వారంలో సిలబస్ మొత్తం పూర్తి కావడంతో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులను జనవరి ఒకటో నుంచి నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులకు పది పరీక్షలు సులభతరం చేసేందుకు ప్రత్యేకమైన స్టడీ మెటీరియల్ కూడా అందించినట్లు తెలిపారు. ప్రతిరోజు తాను పిఎంఆర్‌సి సిబ్బంది పాఠశాలల్లో పర్యవేక్షణ చేసి పిల్లలకు పరీక్షలపై భయం పోగొట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది గతం కంటే మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నామన్నారు.

ఐటిడిఎ పరిధిలో విద్యార్థుల అవస్థలు

పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసే కేంద్రం ఐదు కిలోమీటర్ల పరిధిలో మాత్రమే ఉండాలి. కాని ఐటిడిఎ పరిధిలోని విద్యార్థులు 20 కిలోమీటర్ల దూరం ఆటోలు, వ్యానుల్లో ప్రమాదకరంగా ప్రయాణించి పరీక్షలు రాయాల్సి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రభుత్వం, ఐటిడిఎ ఉన్నతాధికారులు విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రానున్న కాలంలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'పది' పరీక్షలకు పూర్తిస్థాయి ఏర్పాట్లు

ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు

ప్రజాశక్తి - ముసునూరు



పదో తరగతి పరీక్షల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేశామని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు తెలిపారు. విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేశారని చెప్పారు. మండలంలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా సమిష్టి కృషి చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు.

చిట్ చాట్

ప్రశ్న : మండలంలో ఎంతమంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారు?

ఎంఇఒ : మండలంలోని 16 గ్రామాల్లో చదువుతున్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలోని 670 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు హాజరవుతున్నారు.

ప్రశ్న : మండలంలో ఎన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి?

ఎంఇఒ : మొత్తం ఏడు ఉన్నాయి. అవి ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముసునూరు గురుకుల బాలికల పాఠశాల, గోపవరం, వేల్పుచర్ల, చెక్కపల్లి, గుడిపాడు, రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

ప్రశ్న : ఎన్ని గ్రామాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు?

ఎంఇఒ : పదో తరగతి పరీక్షలకు ముసునూరు, చెక్కపల్లి, గోపవరం మొత్తం గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను చేశారు.

ప్రశ్న : పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఏయే ఏర్పాట్లు చేశారు?

ఎంఇఒ : తాగునీరు, ఫ్యాన్లు, టాయిలెట్స్, బెంచీలు మొత్తం ఏర్పాట్లను పూర్తిస్థాయిలో చేశాం.

ప్రశ్న : పరీక్షలు రాసే విద్యార్థులు ఏ సిలబస్‌కు హాజరవుతున్నారు?

ఎంఇఒ : ప్రభుత్వం మొదట్లో సిబిఎస్ సిలబస్ చదివించి ఆ పాఠ్యాంశాల్లోనే పరీక్షకు హాజరు కావాలని తెలిపింది. ప్రస్తుతం స్టేట్ సిలబస్‌కి పరీక్షకు హాజరు కావాలని సిఫార్సులు జారీ చేసింది. ఆ మేరకు పరీక్షకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

టిడ్కో గృహాల లబ్ధిదారులపై అధికారుల వైఖరి దారుణం

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యప్రకాష్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

టిడ్కో గృహ నిర్మాణాలకు సంబంధించి కోట్ల రూపాయల డిపాజిట్లు చెల్లించిన ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు ఉదాసీన వైఖరి అవలంభించడం దారుణమని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సీనియర్ న్యాయవాది ఇందుపల్లి సత్యప్రకాష్ అన్నారు. నూజివీడులో సత్యప్రకాష్ శుక్రవారం మాట్లాడుతూ టిడ్కో గృహ నిర్మాణాలు కావాలని ఆనాటి పాలకులు చెప్పిన మేరకు రూ.500, రూ.50 వేలు, రూ.లక్ష ఆపై డిపాజిట్లు చేసి ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూసిన మధ్యతరగతి కుటుంబాలకు నిరాశే ఎదురైందన్నారు. 2014లో కొనసాగిన తెలుగుదేశం ప్రభుత్వం కాలం తీరిన తర్వాత నిర్మాణాలు చేపట్టి మమ అనిపిస్తే, తరువాత అధికారంలోకొచ్చిన వైసిపి పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని చెప్పారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారులంకొచ్చి సుమారు పది నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు టిడ్కో ఇంటి నిర్మాణాల ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. గృహ నిర్మాణ వినియోగదారుల తరఫున సమాచార హక్కు చట్టంలో అధికారులను సమాచారాన్ని కోరితే గడువు ముగుస్తున్నప్పటికీ ఇప్పటివరకు సమాచారం అందించేందుకు అధికారులు చొరవ చూపకపోవడం ఆవేదన కలిగిస్తుందన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం అప్పీళ్లు చేసుకున్న అర్జీదారునికి సకాలంలో సమాచారం అందించకపోతే రోజుకు రూ.250 అపరాధ రుసుం చెల్లించాలన్న నియమం ఉందని తెలిసిన అధికారులు నిర్లక్ష్యంగా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం అన్యాయమన్నారు.

యానిమేటర్లపై పని భారం తగ్గించాలి

సిఐటియు మండల కార్యదర్శి సాయికిరణ్

ప్రజాశక్తి - కుక్కునూరు

యానిమేటర్లపై పని భారం తగ్గించి, అధికారుల వేధింపులు ఆపాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో యానిమేటర్ల సమావేశం దాసరి సౌజన్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న యానిమేటర్లు చాలీచాలని గౌరవ వేతనాలతో యానిమేటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సమస్యలపై విజయవాడ ధర్నా చౌక్‌లో 36 గంటలు దీక్షలు చేస్తున్న సందర్భంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య శిబిరం వద్దకు వచ్చి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాలపరిమితి సర్క్యూలర్ రద్దు చేస్తామని చంద్రబాబు మాటగా చెప్పారన్నారు. అధికారం లోకొచ్చి తొమ్మిది నెలలవుతున్నా వేతనాలు పెంచలేదని, కాలపరిమితి సర్క్యూలర్ కూడా రద్దు చేయలేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యానిమేటర్ల కాలపరిమితి సర్క్యూలర్ రద్దు చేసి, ప్రతి ఒక్క యానిమేటర్‌కు గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.పది లక్షలు ఇవ్వాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళన పోరాటా లు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యానిమేటర్లు యూనియన్ అధ్యక్షులు కుర్ర గ్రెసి, మెడవరపు రమాదేవి, యాణిమేటర్లు స్రవంతి, అనురాధ, మాధవి, రామల్ల అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విజ్ఞానం అందరికీ అవసరం

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి - ఏలూరు

కంప్యూటర్ విజ్ఞానం నేడు అందరికీ అవసరమని శ్రీకృష్ణ హాస్పిటల్స్ వైద్యులు రామ్‌ప్రసాద్ అన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో 33వ బ్యాచ్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ల ప్రదానం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులకు స్వాగతం పలికి సర్టిఫికెట్లు ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, రిటైర్డ్ ముష్కిల్ మేనేజర్ వై.నిర్మల, రిటైర్డ్ ఆఫీసర్ కృష్ణప్రసాద్ పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న 25 మందికి కోర్సు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నామినల్ ఫీజుతో కంప్యూటర్ శిక్షణ కేంద్రం నడుపుతుండడాన్ని అభినందించారు. ఎనిమిదో తరగతి ఆ పైన చదివేవారికి, గృహిణులు, ఉద్యోగులు వ్యాపారులందరికీ ఉపయోగపడేలా నేర్పే కోర్సులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేర్చుకున్న కోర్సును ఉపాధి వనరుగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. అందుకు కమిట్‌మెంట్ చాలా అవసరమని వివరించారు. డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కంప్యూటర్ కోర్సులో ప్రాథమిక జ్ఞానంతో సరిపెట్టుకోవడం కాకుండా కంప్యూటర్ విజ్ఞానాన్ని నిరంతరం అప్‌డేట్ అవుతున్న విషయాలను నేర్చుకుంటూ అభివృద్ధి కావాల్సిన అవసరం ఉందన్నారు. గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పలుచోట్ల ఘనంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం


టి.నరసాపురంలో...

మండల కేంద్రమైన టి.నరసాపురంలోని విజన్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అన్ని సమాజాలను కలిపి కుల, మత, వర్గ బేధాలు లేకుండా ఇంద్రధనుస్సుగా ఏకం చేసే పండుగ హోలీ అన్నారు. మానవ జీవితంలో కష్టాలన్నీ పోయి సుఖ సంతోషాలతో, ఆనందోత్సవాలతో రంగులు పూసుకొని జరుపుకొనే పండుగ హోలీ అన్నారు. కొన్నిచోట్ల వసంత రుతువుకు ఆరంభ సూచికగా హోలీ పండుగను జరుపుకుంటారని తెలిపారు. హోలీ పండుగ రోజున ప్రతిఒక్కరూ సహజమైన రంగులను మాత్రమే ఉపయోగించాలని ఆయన సూచించారు. కృత్రిమ రంగులతో చర్మ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరులోని దత్తాశ్రమం తోటలో హోలీ వేడుకలు ఘనంగా, సాంప్రదాయంగా నిర్వహించారు. పిల్లలు సాంప్రదాయ హోలీ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు ధరావత్ శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారాలు చాలా పవిత్రంగా జరుపుకునే పండుగ హోళి అని అన్నారు. దీనిని ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో రంగుల పండుగగా జరుపుకుంటారన్నారు. సంఘ జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ ప్రకృతిలో సప్త రంగులు ఉన్నట్లే ప్రతి మనిషి జీవితంలో కష్ట సుఖాలు, లాభ నష్టాలు ఉండే హరివిల్లులు ఉంటాయనే సందేశం హోలీ పండుగ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా రమేష్, ధరావత్ చోక్లా నాయక్, దరావత్ గాంధీ, హసావత్ జానకి పాల్గొన్నారు.

పోలవరం : మండలంలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పోలవరం, పట్టిసీమ, కొత్త పట్టిసీమ, గూటాల, గార్ల గొయ్యి, ఎల్ఎండిపేట, ప్రగడపల్లి, చేగొండపల్లి, కొండ్రుకోట గ్రామాల్లో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాలలకు సెలవు కావడంతో ఉదయం నుంచి పాఠశాల విద్యార్థులు, యువత ఒకరికొకరు రంగులు పూసుకుంటూ హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలో హోలీ వేడుకలను శుక్రవారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. పట్టణ పరిధిలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద మహిళలు ఒకరికొకరు ప్రకృతి సిద్ధమైన రంగులను పులుముకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ హోలీ పండుగ అందరి కుటుంబాలలో నిజమైన పంచరంగుల వేడుక నింపాలని ఆకాంక్షించారు. వేడుకల అనంతరం అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.

స్మార్ట్ మీటర్లను బిగించొద్దు : సిపిఐ

ప్రజాశక్తి - చింతలపూడి

స్మార్ట్ మీటర్ల వల్ల భవిష్యత్తులో ప్రజలపై మోయలేని భారం పడుతుందని స్మార్ట్ మీటర్ల బిగింపు విధానాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మనవ కృష్ణచైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ చింతలపూడి మండల సమితి సమావేశం దొంత కృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత అదే విధానాన్ని అనుసరిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భగత్ సింగ్ వర్ధంతి మార్చి 23 నుంచి అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు దేశ వ్యాప్త ప్రచార ఆందోళనలో భాగంగా జిల్లాలో జరిగే ప్రచార కార్యక్రమంలో సిపిఐ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు, మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, మండల కమిటీ సభ్యులు జంగా రామచంద్రారెడ్డి, బోడ వజ్రం, ఎస్‌కె జాని, గంధం అంజమ్మ, ఎస్‌కె.మస్తాన్, నాగేశ్వరరావు, ఎఐవైఎఫ్ జిల్లా కోకన్వీనర్ తొర్లపాటి రాజు, ఎర్రగుంటపల్లి శాఖ కార్యదర్శి ముల్లంగి కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

మహిళా సమాఖ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా పోలీస్ అధికారికే లేని రక్షణ సామాన్య మహిళకు ఉంటుందా అని పేర్కొన్నారు. ప్రభుత్వాలు విచ్చలవిడిగా మద్యం అమ్ముతూ ఉంటే అవి తాగిన యువత మహిళా పోలీస్‌పై కూడా దాడి చేసే అసభ్యకరంగా మాట్లాడుతూ ఉంటే ఇక సామాన్య మహిళల పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని తెలిపారు. రక్షించే విభాగంలో ఉన్న మహిళలకు కూడా రక్షణ లేకపోవడం అనేది సిగ్గుచేటని పేర్కొన్నారు. ఇటీవల విజయనగరంలో మహిళా ఎస్ఐపై జరిగిన దాడే దీనికి నిదర్శనమని తెలిపారు. మద్యాన్ని నియంత్రించడం ద్వారానే దాడులు అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ దాడులన్నీ కూడా మద్యం మత్తులోనే జరుగుతున్నాయని తెలిపారు. మద్యాన్ని విక్రయించేది ప్రభుత్వాలే కాబట్టి మహిళలపై జరుగుతున్న దాడులకు పరోక్షంగా ప్రభుత్వమే కారణమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు తక్షణమే మద్యం షాపుల నియంత్రణ చేయాలని, లేకపోతే మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని తెలిపారు.

CHANGE OF NAME

I, **BALAM LAKSHMI** W/o. Balam Ganesh, D.No. 3-11, Jona Nagar, Tangellavari Street, Lakshmaneswaram (V) Narasapuram Mandal, W.G.Dt, A.P. I have changed my name from **PEETHANI BHAGYAVATHI** (Old name) to **BALAM LAKSHMI** (New name) hence forth I am being called **BALAM LAKSHMI** W/o. Balam Ganesh for all purposes.

CHANGE OF NAME

I, Valasapalli Sita, W/o. Valasapalli Narasimharao, resident of H.No:1, Near School, Thuvvachilakarayudu palem (V), Lingapalem (M), Eluru District, A.P. PIN - 534462. I have changed my name from Valasapalli Sitha (Old Name) to **Valasapalli Sita** (New Name), Hence forth I am being called as **Valasapalli Sita** (New Name) for all purposes

BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM- III ADDL. DISTRICT JUDGE, R.R. DISTRICT :: AT L.B. NAGAR
M.V.O.P. No. 10/2022

BETWEEN:
Pandipati Laxman
@ Pandiyabatta Laxman ... Petitioner
AND
Mathukumalli Suvarchaladevi and others
... Respondents

To,
1. Mathukumalli Suvarchaladevi, D/o Raghunadha Babu Aged: Major, Occupation : Owner of the Vehicle R/o. D.No. 17-4-16/3, Guntur Road, Narsaraopeta, Guntur District 522601.
2. T. Sai Pavan Kumar, S/o Srinivasa Rao Aged: 25 years, Occupation : Driver of the Vehicle R/o H.No.2-84/1, China Ayyappa Nagar, Dodipatla Yelamanchili, Yelamanchili, West Godavari Dt. - 534266
....Respondent Nos. 1 to 2

NOTICE

Please take notice that the Petitioner filed the above petition under M.V. Act Claiming Compensation and the Hon'ble Court was pleased In to post at the same on 09-04-2025 at 10:30 a.m for your appearance. inspite of this clear notice, if you failed to appear before the Hon'ble Court, the matter will be decided in your absence. Hence, this Notice

(BY ORDER OF THE COURT)

V. THRIMURTHULU,
Advocate.
Office Chambers: #2-2-90/16, S. No. 9, Srinath Enclave, Amberpet, Hyderabad - 500 013.
Cell No. 9246165838